
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

మంగళవారం 22 అక్టోబరు 2024

విద్యుదాఘాతానికి ముగ్గురు రైతులు బలి

● వేర్వేరు చోట్ల ఘటనలు 7

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సకాలంలో మున్సిపల్ ఇంటిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బిల్లులను మున్సిపల్ రెవెన్యూ సిబ్బందితో కలిసి కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సోమవారం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్నినెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను రూ. 3,31,150ను వసూలు చేసినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఇంటి, నీటి పన్నులను ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. పన్నులు సకాలంలో చెల్లిస్తే అపరాధ రుసుము భారం పడదన్నారు.

ఇల్లు మారిన గృహజ్యోతి లబ్ధిదారులు అప్‌డేట్ చేసుకోవాలి

అద్దె ఇళ్లు మారిన గృహజ్యోతి అర్హులు తమ ఆధార్ కార్డు, కొత్తఇంటి ఇంటి విద్యుత్ బిల్లు వివరాలను మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారుల సమన్వయంతో అప్‌డేట్ చేసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు, విద్యుత్ శాఖ ఏడీఈ, మున్సిపల్ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన గృహజ్యోతి పథకం అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. నూతన గృహజ్యోతి పథకానికి ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో అందజేసిన దరఖాస్తులను ప్రభుత్వం ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వగానే నమోదు చేస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, మున్సిపల్ వార్డు అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పీచు.. 7

ఎక్కువ ఘాటు

● కోహీర్ అల్లానికి భలే డిమాండ్..



సిద్దిపేటలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వర్షానికి కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

అతలాకుతలం

అకాల వర్షంతో రైతులకు తిప్పలు.. కొట్టుకుపోయిన ధాన్యం, మక్కలు

● జిల్లాలో గాలివాన బీభత్సం.. పలుచోట్ల నేలవాలిన వరి పంట

● ఇంకా ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు

సిద్దిపేట కలెక్టరేట్/చేర్యాల/చిన్నకోడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు మండలాల పరిధిలో సోమవారం వరుణుడు విజృంభించాడు. పలు గ్రామాల పరిధిలో ఇప్పటికే వరికోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల కోత దశలో ఉన్నాయి. కోత



వడ్ల రాశి పైన నీటిని తొలగిస్తున్న రైతులు



వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

పూర్తయినా వారు ధాన్యాన్ని శుద్ధి చేసి కొనుగోలు కేంద్రాల వద్ద, గ్రామాల పరిధిలోని రోడ్లపైనా ఆరబోసి రాత్రనక పగలనక పడిగాపులు కాస్తున్నారు. సోమవారం సాయంత్రం వేళ ఈదురుగాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. వాన నీటి ప్రవాహానికి కొన్నిచోట్ల ధాన్యం కొట్టుకుపోయింది. గాలివాన



చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులో నేలవాలిన వరి

ధాటికి కోత దశలో ఉన్న వరి చేను నేలవాలింది. సిద్దిపేట మార్కెట్‌యార్డులో ఉదయం పూట ఎండ కొట్టడంతో యార్డుకు తీసుకొచ్చిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టారు. ఒక్కసారిగా వర్షం పడడంతో వారికి ధాన్యపు రాశులు తడిసిముద్దయ్యాయి ఎటుచూసినా తడిసిన ధాన్యపు రాశులు, కొట్టుకుపోయిన వడ్లు, మక్కల దృశ్యాలే కనిపించాయి. వాన వెలిసిన తరువాత రైతులు ధాన్యాన్ని, మక్కలను ఏరుతూ ఒకచోటుకు చేర్చుతూ కొట్టుకుపోయిన ధాన్యాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. చేర్యాల మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చిన ధాన్యం తడిచింది. చిన్నకోడూరు పరిధిలో రైతులు టార్పాలిన్లను కప్పి ఉంచడంతో వరుణుడి గండం నుంచి గట్టెక్కారు. కోత దశలో ఉన్న పంట నేలవాలడంతో రైతులకు నష్టాన్ని మిగిల్చింది.

ప్రారంభానికి నోచుకోని కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకా పూర్తిస్థాయిలో కేంద్రాలు తెరుచుకోలేదు. ప్రారంభమైన కేంద్రాల్లోనూ ఇంకా ధాన్యం కొనుగోళ్లను మొదలుపెట్టలేదు. ఈ వానకాలం సీజన్లో 4 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనాలు వేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం 417 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ ఇప్పటివరకు 81 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువ

మిగతా 8వ పేజీలో...

పిడుగుపడి మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

తొగుట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామ పంచాయితీ పరిధిలో సోమవారం పిడుగుపడడంతో మహిళ మృతిచెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామ పరిధి వడ్డెర కాలనీకి బోదాస్ మల్లయ్యకు భార్య లక్ష్మి (54), ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మల్లయ్యకు వ్యవసాయ భూమి ఉండగా, రోజు బండ కొట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని కాలువ వద్ద బండ కొట్టడానికి మల్లయ్య వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో భర్తకు భోజనం తీసుకుని లక్ష్మి వెళ్లింది. అక్కడే ఉన్న చింతచెట్టు కింద ఆమె కూర్చున్నది. కొద్ది దూరంలో బండపైన మల్లయ్య కూచుని భోజనం చేస్తున్నారు. అకస్మాత్తుగా వర్షంతో పాటు పిడుగు పడటంతో చెట్టుకింద ఉన్న లక్ష్మి అక్కడే కిందపడిపోయింది. వెంటనే మల్లయ్య అపస్మారక స్థితికి చేరుకున్న లక్ష్మిని చుట్టుపక్కల వారి సహాయంతో ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నిస్తుండగానే కన్నుమూసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.



పోలీస్ అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

పోలీసుల త్యాగాలు మరువలేం

● అమరులైన వారి కుటుంబాలకు అండగా జిల్లా యంత్రాంగం

● కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ

● ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

సిద్దిపేట క్రైం, అక్టోబరు 21 : పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేమని కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) సందర్భంగా పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ కమిషనర్ అనురాధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ మనుచౌదరి హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్, పోలీస్ కమిషనర్ అడిషనల్ డీసీపీలు ఎస్.మల్లారెడ్డి, రాంచందర్‌రావు, సుభాష్‌చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, జిల్లా పోలీసు అధికారులు, అమరుల పోలీసు కుటుంబ సభ్యులు, అధికారులు, సిబ్బందితో కలిసి పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ఆర్ఎస్ఐలు సాయిప్రసాద్, బాలకృష్ణ, ఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో స్మృతి పరేడ్ గౌరవ వందనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ మాట్లాడారు. పోలీసు అమరవీరుల సభ్యులకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తరఫున ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని తెలిపారు. అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి వారి సాధకబాధలను తెలుసుకుని చిరు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, శ్రీధర్ గౌడ్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను,

మిగతా 8వ పేజీలో...



అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

‘డబుల్’ ఇళ్లను తక్షణమే అందించాలి

● ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించిన లబ్ధిదారులు.. గంటన్నర పాటు ఆందోళన

● సర్వే పూర్తయ్యాక ఇళ్లను అప్పగిస్తాం

● ఆర్డీవో బన్సీలాల్

గజ్వేల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లను తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్‌లోని ఆర్డీవో కార్యాలయాన్ని లబ్ధిదారులు సోమవారం ముట్టడించారు. ఏడాదిన్నర క్రితం లక్కీ డ్రా ద్వారా తమకు ఇళ్లను కేటాయించి ఇప్పటి వరకు ఇళ్లను అప్పగించలేదని, కనీసం పట్టా కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే తమకు ఇళ్లను అప్పగించాలన్నారు. దాదాపు గంటన్నరపాటు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. లక్కీ డ్రా ద్వారా కేటాయించిన ఇళ్లలో మల్లన్నసాగర్ నిర్వాసితులు నివాసం ఉంటున్నారని, వారికి సంబంధించిన ప్యాకేజీ, పరిహారాలు ఏమేం పెండింగ్‌లో ఉన్నాయో సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. సర్వే పూర్తయ్యాక వారికి రావాల్సిన పరిహారం అందజేసి, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామని ఆయనహామీ ఇచ్చారు. అయినా కూడా లబ్ధిదారులు వినకపోవడంతో మరోసారి ఆర్డీవో వారి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



గజ్వేల్‌లో ఆందోళన చేస్తున్న డబుల్ ఇళ్ల లబ్ధిదారులు

మూసివేతగా దిశగా బీడీ కంపెనీ!

● ఇప్పటికే ప్రకటించి ‘భాషా’ యాజమాన్యం

● కంపెనీ మూతపడితే 800 మంది కార్మికుల బతుకులు ఆగం



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆ బీడీ కంపెనీ మీదనే ఆధారపడి దాదాపు 800 నుంచి వెయ్యి మంది వరకు జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా కంపెనీ మూసేస్తామని యాజమన్యం ప్రకటించడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు.

దాదాపు 33 సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో భాషా బీడీ కంపెనీ కొనసాగుతుంది. సుమారు 22 గ్రామాల నుంచి దాదాపు వెయ్యి మంది వరకు బీడీ కార్మికులు ఈ కంపెనీలో బీడీలు చేస్తున్నారు. కొంతకాలంగా కంపెనీ మూసేస్తామంటూ యాజమన్యం చెప్పడంతో దంతో హిందూ మజ్దూర్ సంఘ్(హెచ్ఎంఎస్) కార్మికులకు అండగా నిలిచింది. పలుమార్లు కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపింది. ఎత్తేయకుండా పోరాటాలు కూడా నిర్వహించింది. అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అయితే, మొదట్లో చర్చలకు సానుకూలంగా స్పందించిన యాజమాన్యం తదుపరి కంపెనీని ఖచ్చితంగా మూసివేస్తామని ప్రకటించడంతో కార్మికులు మరింత ఆందోళన చెందుతున్నారు. సుమారు వెయ్యి మంది కార్మికులు పనిచేస్తున్న కంపెనీని మూసివేయాలన్నా మరోచోటుకు తరలించాలన్నా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో కంపెనీకి సంబంధించిన కార్మికుల ఐడీ కార్డులను ఆధారాలతో సమర్పించామని సుమారు 800 నుంచి వెయ్యి మంది పనిచేస్తున్నారని, అనుమతులు లేకుండా కంపెనీ మూసివేస్తే యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకు లు ఆరోపిస్తున్నారు.. అయితే వంద మంది కార్మికులు కూడా లేరని, వందలోపు ఉంటే కంపెనీ మూసేయడానికి ఎవరి అనుమతులు అక్కర్లేదని యాజమాన్యం చెబుతున్నట్లు తెలిసింది.

న్యాయం జరిగే వరకూ పోరాటం

కంపెనీ అర్ధాంతరంగా మూసివేయడంతో వందలాదిమంది కార్మికులు రోడ్డున పడే అవకాశం ఉంది. కాబట్టి కార్మికులకు న్యాయం జరిగే వరకూ సంఘం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తాం. అవసరమైతే యాజమాన్యంపై కేసులు పెట్టించి జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

- మల్లేశం, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకుడు



అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో చర్చలు జరుపుతున్న యాజమాన్య కార్మిక సంఘాలు

ప్రజావాణికి 8

50 దరఖాస్తులు

● స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా

క్రికెట్ జట్టు ఎంపికలు

● రేపు కరాటే, తైక్వాండో సెలక్షన్

7

హార్టికల్చర్ వర్సిటీ

ఉపకులపతిగా డాక్టర్ రాజిరెడ్డి

ములుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతిగా డాక్టర్ రాజిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ములుగు హార్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతిగా ఇంతకాలం బాధ్యతలు నిర్వర్తించిన నీరజాప్రభాకర్ బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో డాక్టర్ రాజిరెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఉపకులపతి డాక్టర్ నీరజా ప్రభాకర్ రిజిస్టర్ భగవాన్, రాజశేఖర్, విజయ్‌తో పాటు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు.



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాజిరెడ్డి

అమ్మకానికి శిశువు?

● తల్లీబిడ్డను పట్టుకున్న అంగన్‌వాడీ టీచర్

● సిద్దిపేట సఖీ కేంద్రానికి తరలింపు


దౌల్తాబాద్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): 20 రోజుల క్రితం పుట్టిన ఆడబిడ్డను కన్నతల్లే అమ్మకానికి పెట్టగా తల్లిని పట్టుకుని, శిశువును బాలల సంరక్షణ కేంద్రానికి తరలించిన ఘటన సంఘటన దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియాల్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్నది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పరిధి పల్లెపహాడ్ గ్రామానికి చెందిన ఓ మహిళ 20 రోజుల క్రితం ఆడశిశువుకు జన్మనిచ్చింది. సోమవారం గుర్తుతెలియని ఇద్దరు బైక్ మీద ఇందుప్రియాల్‌కు వచ్చి శిశువు విక్రయానికి బేరం మాట్లాడుతున్నారు. ఇంతలో వారి మధ్య గొడవ కావడంతో అక్కడే ఉన్న మేకల కాపర్లు గమనించి అక్కడికి వెళ్లే లోపే అందరూ వెళ్లిపోయారు. విషయాన్ని వారు గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ సుల్తానాకు సమాచారం అందించారు. ఆమె ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి తల్లిబిడ్డను అంగన్‌వాడీ కేంద్రానికి తరలించారు. 1098 ద్వారా వివరాలు తెలుసుకున్న సిద్దిపేట మహిళా శిశు సంక్షేమ అధికారులు ఇందుప్రియాల్ చేరుకుని తల్లీబిడ్డను సిద్దిపేటలోని సఖీ కేంద్రానికి తరలించారు. తన బిడ్డను ఎందుకు అమ్ముతుందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తల్లి విచారణకు సహకరించడంలేదని మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తామని అధికారులు తెలిపారు. బైక్‌పై వచ్చిన వారి వివరాలు కూడా తెలియాల్సి ఉంది.



మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు













మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మహిళ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కిరణ్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావ్య, రేణుక, శివలక్ష్మి, సీసీలు రమేష్ రెడ్డి, దేవరాజ్, స్వామి పాల్గొన్నారు.

ఐఆర్‌డీ వైఖరిని నిరసిస్తూ ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏజెంట్లు

జహీరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు హెడ్‌గా వ్యవహరించే ఐఆర్‌డీ(ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ), ఎల్ఐసీ యాజమాన్యాల వైఖరిని నిరసిస్తూ సోమవారం ఎల్ఐసీ ఏజెంట్లు పట్టణంలోని కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఆర్‌డీ తీసుకొచ్చిన నిర్ణయం పాలసీదారులకు, ఏజెంట్లకు ఇబ్బందిగా మారనున్నదన్నారు. ఎల్ఐసీ పాలసీని తీసుకునే వారి వయస్సును 50 ఏళ్లకు కుదించారని, పాలసీ హోల్డర్‌కు బోనస్‌ను పెంచలేదన్నారు. తమ సమస్యకు పరిష్కారం లభించేవరకు ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు తేజరెడ్డి, వెంకటేశం, సుభాష్, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.


సింగూరు జలాలు జిల్లా ప్రజల హక్కు

● సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింగూరు జలాలు జిల్లా ప్రజల హక్కు అని, సాగు, తాగుకు ఇవ్వాల్సిందేనని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన జిల్లా మూడో మహాసభలు దిగ్విజయంగా ముగిశాయన్నారు. జిల్లాలో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నా కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.









క్రైం కార్నర్

యువకుడి దారుణ హత్య


అనీల్(ఫైల్)

సదాశివపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలోని 6వ వార్డు కృష్ణానగర్ కాలనీలో దారుణం చోటు చేసుకున్నది. ఆ కాలనీకి చెందిన తబ్యా అనీల్(27) హత్యకు గురయ్యాడు. స్థానిక సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకెళ్లిన అనీల్ ఎంతసేపటికీ తిరిగి రాలేదు. ఉదయం కాలనీ సమీపంలో ఓ నర్సరీలోని షెడ్డులో కత్తి పోట్లతో రక్తపు మడుగులో అనీల్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. అనీల్ హత్యకు పాత కక్షలే కారణంగా తెలుస్తున్నది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలింగ్‌ను ఢీకొట్టిన బైకు

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

బెజ్జంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బైకు రైలింగ్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బోనగిరి మనోజ్ (25), భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన జోన్ అన్విత్ స్నేహితులు. కరీంనగర్‌లో రూమ్ అద్దెకు తీసుకొని వివిధ పనులు చేస్తూ జీవిస్తున్నారు. సోమవారం ద్విచక్ర వాహనంపై బెజ్జంకి వైపు బైకుపై వస్తున్న క్రమంలో మండలంలోని తోటపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారి పక్కకు ఉన్న రైలింగ్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంలో వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బోనగిరి మనోజ్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


లింగంచారి (ఫైల్)

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పాత లింగాయపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కమ్మరి లింగంచారి(36) హైదరాబాదులో మేస్త్రిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దసరా పండుగ కోసం గ్రామానికి వచ్చి అప్పటి నుంచి అక్కడే ఉన్నాడు. కొన్ని నెలలుగా పని సరిగా లేక సంసారం నిమిత్తం అప్పులు చేశాడు. వాటిని తీర్చేమార్గం లేక నిత్యం భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన లింగంచారి సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

సదాశివపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగడపల్లి గ్రామ చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సోమవారం ఉదయం చెరువులో 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం తేలగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్నవారు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాపన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద హరితా హోటల్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నీరసించి లేవలేని స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని 108లో మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. నాగ్సాన్పల్లి పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి 65-70 ఏళ్ల వయస్సు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, ధోతీ ధరించి ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ నంబర్ 8712657920ను సంప్రదించాలని కోరారు.

మహిళా సంఘాలకు నాటు కోళ్ల పంపిణీ

రాయపోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలోని పలు గ్రామాల మహిళా సంఘాలకు సోమవారం నాటు కోళ్లను పంపిణీ చేశారు. ఒక కోడి రూ.105 చొప్పున చెల్లించిన సంఘాలకు గ్రామానికి 50 కోళ్ల చొప్పున 1100 కోళ్లు అందజేసినట్లు ఏపీఎం కిషన్ తెలిపారు.


కోహీర్ మండలంలో సాగు చేస్తున్న అల్లం పంట

సారవంతమైన ఎర్ర భూమి

కోహీర్ మండలంలో 70 శాతం ఎర్రనేలలు ఉన్నాయి. కుంకుమను పోలిన ఈ ఎర్ర భూములు ఎంతో సారవంతమైనవి. ఈ భూమిలో పండిన ఏ పంటకైనా రుచి ఎక్కువగా ఉంటుంది. పోషక విలువలు అధికంగా ఉంటాయి. ఎర్రని భూముల్లో తేమశాతం తక్కువ. వర్షాలు అధికంగా కురిసినా భూమి లోపల ఉండే పంట పాడవకుండా నిల్వ ఉంటుంది. సాగుకు నీరు అధికంగా అవసరం. అల్లం, చెరుకు, ఆలుగడ్డ, పసుపు, అరటి, మిరప, మొక్కజొన్న, జొన్న, కూరగాయల పంటలకు ఎర్ర నేలలు అనువైనవి కాగా మండలంలో రైతులు ఎక్కువగా అల్లం సాగువైపు మొగ్గు చూపుతారు.

తక్కువ పీచు.. ఎక్కువ ఘాటు

కోహీర్ అల్లానికి భలే డిమాండ్.. మండలంలో విస్తారంగా పంట

● యేటా 1200 ఎకరాల్లో సాగు

● సారవంతమైన ఎర్రనేలలతో నాణ్యమైన పంట దిగుబడి



కోహీర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : కూర అయినా.. ఊరగాయ అయినా ఘుమఘుమలాడ లాంటే కాస్త అల్లం దట్టించాల్సిందే. ఘాటుతనం.. కారం పాలు అధికంగా కల.. పీచుదనం తక్కువగా ఉండే అల్లం తగిలితే వంటకం యమ రుచిగా తయారవుతుంది. అలాంటి నాణ్యమైన అల్లం పంటకు పేరుగాంచింది సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం. కుంకుమను పోలిన ఇక్కడి ఎర్రని నేలల్లో పండే అల్లంలో తేమ శాతం అధికంగా ఉండడంతో ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది. పీచు లేని ఈ అల్లంతో తయారు చేసిన పేస్టు చాలా రోజుల వరకు నిల్వ ఉంటుంది. ఔషధ గుణాలు అధికంగా ఉండడం వల్ల శొంఠి తయారీలో ఎక్కువగా వాడుతారు. ఆయుర్వేద మందుల తయారీకి కోహీర్ అల్లం ఉపయోగపడుతుంది.

అనువైన నేలలు.. అనుకూల వాతావరణం

కోహీర్ మండలంలో అనువైన ఎర్రనేలలు, అనుకూల వాతావరణం ఉండడంతో రైతులు ఎక్కువగా దేశీయ అల్లం (కోహీర్ అల్లం) పంటను పండిస్తారు ఏటా 1200 ఎకరాల్లో పంట సాగువుతున్నది. మండలంలోని బిలాల్‌పూర్, మాచిరెడ్డిపల్లి పీచేర్యాగడి, సజ్జాపూర్ మనియార్‌పల్లి, బడంపేట, గురుజువాడ, గొటిగార్‌పల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో అల్లం అధికంగా పండిస్తారు. ఒక్కోసారి మార్కెట్లో ధర లేక నష్టం వాటిల్లినా నిరుత్సాహపడకుండా తర్వాత సంవత్సరం మళ్లీ అల్లం పంటనే పండిస్తారు. ఒక యేడు నష్టం వచ్చిన మరో ఏడాదైనా రెండింతలు లాభం వస్తుందని రైతుల నమ్మకం. ఇక్కడి చిన్న, సన్నకారు రైతులు సైతం తమకున్న పొలంలో ఎంతో కొంత అల్లం పంటను సాగు చేయక మానరు.

ఎనిమిది నెలల పంటకాలం

ఎకరాకి నాలుగు పుట్ల (ఆరు క్వింటాళ్ల) అల్లం విత్తనం వేస్తారు. మూడు లారీల పేంట ఎరువు(సేంద్రియ ఎరువు), ఒక లారీ కోడి ఎరువు వేస్తారు. మొదట దూకి చేసుకున్న తర్వాత ఎరువులు వేసి బోదే దూకి చేసి అల్లం విత్తనం వేస్తారు. అనంతరం డ్రిప్ పైప్ లైన్ల ద్వారా నీటిని అందిస్తారు. కొంత మంది డ్రిప్ లేకుండా నీటిని అందిస్తారు. 20 రోజుల తర్వాత మొలకెత్తుతుంది. ఎనిమిది నెలల తర్వాత పూర్తి పంట వస్తుంది. పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్లో ఒకవేళ ధర లేకుంటే మరో ఆరు నెలల వరకు అల్లాన్ని తవ్వకుండా భూమిలోనే ఉంచినా పాడవదు. ప్రస్తుతం అల్లం సాగు చేయడానికి ఎకరాకు లక్ష ఖర్చవుతుంది.

నాడు ఆటో డ్రైవర్‌ను.. నేడు అల్లం రైతును..



పదేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో అల్లం సాగు చేసి లాభాలు పొందాను. అప్పటి నుంచి ఆటో వృత్తిని మానుకొని అల్లం రైతుగా మారాను. ప్రతీ సంవత్సరం ఐదు నుంచి 10 పుట్ల అల్లం వేస్తాను. ఏటా అధిక దిగుబడి సాధిస్తూ లాభాలు పొందుతున్నాను.

\- భాస్కర్, బిలాల్‌పూర్

కోటి రూపాయల అల్లం పండించా..



కొన్నేళ్లుగా అల్లం పంట సాగు చేస్తున్నాను. 8 సంవత్సరాల క్రితం కోటి రూపాయల అల్లం పంటను పండించాను. ఇలా ప్రతీ యేటా మంచి లాభాలు పొందుతున్నాను. ఒక సంవత్సరం నష్టం వచ్చినా మరో సంవత్సరం లాభాలు వస్తాయని నమ్మకంతోనే అల్లం సాగు చేస్తున్నాను.

\- మల్లికార్జున్, వెంకటాపూర్

విద్యుదాఘాతానికి ముగ్గురు రైతులు బలి

● వేర్వేరు చోట్ల ఘటనలు

సదాశివపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నాగులపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులపల్లి గ్రామానికి చెందిన మునిపల్లి బాబు(35) సోమవారం ఉదయం 11గంటల సమయంలో తన వ్యవసాయ పొలంలో బోర్‌మోటార్ ఆన్ చేస్తుండగా మోటార్ స్టార్టర్ నుంచి విద్యుత్ ప్రవహించడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. బాబుకు భార్య వీణ, ఇద్దరు పిల్లలు భానుతేజ్(6), భార్గవి(4) ఉన్నారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

మిషన్ తగిలి వైర్లు తెగిపడి..


దుర్గేష్ (ఫైల్)

హత్నూర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరి కోత మిషన్‌కు విద్యుత్ వైరు తగిలి తెగిపడడంతో షాక్‌క గురై రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగుల్ దేవులపల్లిలో సోమవారం జరిగింది. ఆ గ్రామానికి చెందిన పడాల దుర్గేష్ (30) తన పంట పొలంలో వరి కోత కోస్తుండగా.. మిషన్ తగిలి విద్యుత్ వైరు తెగిపడింది. బురదగా ఉన్న పొలంలో ఉన్న రైతు దుర్గేష్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వరి కోత మిషన్ డ్రైవర్ ప్రాణాలతో బయట పడ్డాడు. మృతుడికి భార్య లత, ఐదు నెలల పాప ఉన్నారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

పంట రక్షణ కోసం వేసిన తీగలు తగిలి..


కిషన్ (ఫైల్)

వెల్దుర్తి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : వన్య ప్రాణుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని యశ్వంతరావుపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసుపల్లి కిషన్(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పొలం వద్ద అడవి పందుల బెడద నుంచి పంటను రక్షించుకోవడం కోసం విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం పొలం వద్ద వెళ్లిన కిషన్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి వెతకగా విద్యుదాఘాతంతో మృతిచెంది ఉన్నాడు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజు తెలిపారు. అలాగే శనివారం అదే గ్రామానికి చెందిన గుండెని యాదయ్య తన వ్యవసాయ పొలంలో పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలిమృతి చెందాడు. వరుసగా ఇద్దరు రైతులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్లుకు ఎంపికైన క్రీడాకారులు

ఉత్సాహంగా క్రికెట్ జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఎం.ఎస్. అకాడమీలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రికెట్ ఎంపికలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలిరాగా, ప్రతిభ చూపినవారిని నాలుగు జట్లుగా ఎంపిక చేశారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారితో తుది జట్టు ఎంపిక ప్రక్రియ నేటి నుంచి చేపట్టనున్నారు. తుది జిల్లా జట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 4 వ తేదీన సంగారెడ్డి, వరంగల్‌లో జరిగే అండర్-23 అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఏ.రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ఎంపికల్లో అసోసియేషన్ సభ్యులు మధుమోహన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కోచ్‌లు చంద్రమౌలి, ఇనాం, మహేందర్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కరాటే, తైక్వాండో ఎంపికలు

ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న సదాశివపేటలోని విజ్ఞాన్ మోడల్ హైస్కూల్‌లో అండర్-19 బాల బాలికల కరాటే, తైక్వాండో జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9848578970, 8106841226 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

తాళం పగులగొట్టి భారీ చోరీ

రూ.18 లక్షలు, 21 తులాల బంగారం, మూడు కిలోల వెండి అపహరణ

అనంతగిపల్లిలో రూ.70వేల నగదు, నగలు


కోహీర్: బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

కోహీర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీచేర్యాగడి పాత తండాలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే తండా సమీపంలోని దుర్గమ్మ-మైసమ్మ ఆలయ పూజారి రమేష్ స్వామి ఆ ఆలయ సమీపంలోనే నివాసముంటున్నాడు. రమేష్ స్వామికి మరో ముగ్గురు సోదరులున్నారు. ఆ నలుగురికి చెందిన నాలుగు ఎకరాల భూమిని విక్రయించి ఆ డబ్బుతో గతంలో జహీరాబాద్‌లో ఓ ఇల్లు కొనుగోలు చేశారు. ఇటీవల ఆ ఇల్లును విక్రయించగా వచ్చిన రూ.18 లక్షలతో పాటు వారందరికి చెందిన వెండి, బంగారంను కూడా రమేష్ ఇంట్లోనే దాచారు. కాగా, ఆదివారం రాత్రి రమేష్ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన అతడికి తలుపులు తెరిచి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లో ఉన్న రూ.18 లక్షల నగదు, 21 తులాల బంగారం, మూడు కిలోల 70 గ్రాముల వెండి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులకు అక్కడికి చేరుకుని క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరించారు.

అనంతగిరిపల్లిలో..

వర్గల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతగిరిపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తిమ్మాయిపల్లి మల్లేష్ ఈ నెల 19న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గజ్వేల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.70వేలు, అర తులం బంగారు చైన్, 15 తులాల వెండి ఆభరణలు కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి క్లూస్ టీంతో కలిసి చేరుకుని ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


వర్గల్: చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడి

ఆలయాలపై దాడులకు నిరసనగా బీజేపీ ర్యాలీ


జిన్నారంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలపై దాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో జిన్నారంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, హిందూ సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆయన స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అమరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. దాతల నుంచి 103 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రాజశేఖర్, దేమో యాదగిరి, బోస్, డీఎస్పీలు, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

స్టడీటూరుకు 26 మంది అధికారులు

● 8 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో పర్యటన

● కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి పర్యటన ఉద్యోగి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో ఎనిమిది రోజుల పాటు పర్యటనకు వచ్చిన ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందంతో కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ ందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 28 వరకు మొదటి ఐదు రోజులు గ్రామ స్థాయిలో, చివరి మూడు రోజులు అర్బన్ ఏరియాల్లో 26 మంది ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు పర్యటిస్తారనన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పరిశీలిస్తారన్నారు. జిల్లాలోని అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ వారికి వివరించారు. సమావేశంలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ శంకర్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఏవో గోవింద్, డీఎంహెచ్‌వో డా.శ్రీరాం, జిల్లా సంక్షేమాధికారి హైమావతి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆలిండియా సర్వీసెస్ అధికారులు


రాయిలపూర్‌లో అధికారులకు స్వాగతం..

న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 21 : సివిల్ సర్వీస్ ఉద్యోగంలో భాగమైన ఫౌండేషన్ కోర్సు శిక్షణ కోసం ఆలిండియా సర్వీసెస్ అధికారుల బృందాలు సోమవారం పలు గ్రామాలకు చేరుకున్నాయి. వారు మూడునాలుగు రోజుల పాటు గ్రామాల్లోనే పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలతో పాటు గ్రామాల అభివృద్ధి జరుగుతున్న తీరును పరిశీలించి అధ్యయనం చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల తీరు, ప్రజారోగ్యం నిర్వహణను పరిశీలిస్తారు. అలాగే జనాన్ని చైతన్యం చేస్తూ.. గ్రామ పురోభివృద్ధి విషయంలోనూ ఈ బృందం చర్చిస్తుంది. తూప్రాన్ మండలం మల్కాపూర్, మనోహరాబాద్ మండలం కూచారం, కౌడిపల్లి మండలంలోని రాయిలపూర్, నర్సాపూర్ మండలం ఆవంచ, రామాయంపేట మండలం ప్రగతిధర్మారం గ్రామాలకు అధికారులు చేరుకున్నారు. వారికి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సాదారంగా ఆహ్వానం పలికారు. ఆవంచ గ్రామంలో మంగళహారతులు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు.

చేగుంటలో కారు దగ్ధం



చేగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏసీ షార్టు సర్క్యూట్ తో మంటలు చెలరేగి ఆల్టో కారు దగ్ధమైన సంఘటన చేగుంట మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా ఆందోల్ పట్టణానికి చెందిన రాఘవేంద్రశర్మ చేగుంటలోని తమ సమీప బంధువు కృష్ణ రఘురామశర్మ ఇంటికి సోమవారం మధ్యాహ్నం వచ్చారు. కారును ఇంటి ఎదుట రైస్‌మిల్ ఆవరణలో చెట్టు కింద నిలిపి బంధువుల ఇంటి లోపలికి చేరేలోపు కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి రామాయంపేట ఫైర్ ఇంజన్ వచ్చేలోపు కారు పూర్తిగా కాలిపోయింది.

జనశక్తి మాజీనేత బాలన్న పాడె మోసిన అమర్


బాలన్న పాడె మోస్తున్న జనశక్తి పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి అమర్

మిరుదొడ్డి, అక్టోబరు21(అంధ్రజ్యోతి): జనశక్తి పార్టీ మాజీ నాయకుడు, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు అందె బాలన్న ఆదివారం రాత్రి మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో అనారోగ్యంతో మరణించారు. సుమారు 40 ఏండ్లపాటు విప్లవ ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయన కుమారుడు భాస్కర్ అరుణోదయ సంస్థలో డోలక్ వాయిద్యకారుడిగా ఉంటూ, ఉస్తాద్‌బిస్మిల్లాఖాన్ అవార్డును కూడా పొందారు. సోమవారం గ్రామంలో జరిగిన బాలన్న అంత్యక్రియల్లో జనశక్తి రాష్ట్ర మాజీ కార్యదర్శి అమర్ పాల్గొని పాడె మోశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూపతి, పద్మశ్రీ అవార్డు గ్రహిత గడ్డం సమయ్యలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాలన్న మృతిపై డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లింగుపల్లి శంకర్ సంతాపం తెలిపారు.

క్రైం కార్నర్

మద్యం దుకాణంలో చోరీ

రాయపోల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ వైన్స్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి రూ. 40వేల నగదుతో పాటు రెండు మందు బాటిల్లు, సీసీ కెమెరా డీవీఆర్లను దొంగలించారు. ఈ మేరకు వైన్స్ యజమాని బబ్బూరి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. తొగుట సీఐ లతీఫ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, అక్టోబరు 21: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 17 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి 17 మందికి రూ.29,500 జరిమానా విధించారు.

ప్రజావాణికి 50 దరఖాస్తులు

- స్వీకరించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- త్వరితగతిన అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని సూచన


ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్ అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు ప్రజావాణిలో పెట్టుకున్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులను స్వీకరించారు. భూ సంబంధిత, డబుల్ బెడ్ రూం ఇళ్లు, పింఛన్లు, ఇతరత్రా మొత్తం కలపి 50 దరఖాస్తులు అందాయని ఆయన తెలిపారు. అనంతరం స్పూర్తి లయన్స్‌క్లబ్ సిద్దిపేట ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహించే మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో వివిధ విభాగాల సిబ్బందికి మానసిక ఆరోగ్యం-ఒత్తిడిని జయించడం ఎలా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ మామిడాల శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఒత్తిడి ప్రతి వారి జీవితంలో ఒక భాగం అయిందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రుణ మాఫీ కాలేదు

గజ్వేల్‌లోని ఎస్బీఐ బ్యాంకులో రూ.1.45 లక్షల పంట రుణం తీసుకున్నాను. నేను ప్రతీసారి పంట రుణాన్ని రెన్యూవల్ చేయిస్తున్నాను. పంట రుణానికి అర్హుడినైనా నాకు రుణమాఫీ కాలేదు. వ్యవసాయశాఖ అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదు. నాకు పంట రుణం మాఫీ అయ్యేలా చూడాలి

- బాలకృష్ణయ్య రైతు, శ్రీగిరిపల్లి, గజ్వేల్ మండలం

సమైక్య సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయాలి

మా గ్రామం ఏర్పడి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు గ్రామ మహిళా సమైక్య సంఘాన్ని రిజిస్ట్రేషన్ కానీ ఆన్‌లైన్ కానీ చేయలేదు. దీంతో ప్రభుత్వం ద్వారా రావలసిన పథకాలు అందడం లేదు. లావాదేవీల నిర్వహించడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

-భుక్యా బిక్షపతినాయక్, మాజీ సర్పంచ్, జేపీ తండా గ్రామం

కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్


మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్

సిద్దిపేట టౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సూచించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా నయాగావ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో తెలంగాణ రాష్ట్ర ఆగ్రో కార్పోరేషన్ చైర్మన్ బాలరాజు, సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శివప్పతో కలిసి ఎంపీ సురేష్ షెట్కార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాల గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థి విజయం కోసం పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇది అందరి కృషి వల్ల సాధ్యమైందన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు, నాయకులకు ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో శ్రీనివాసరెడ్డి

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను, సైన్స్ పట్ల మక్కువను ఇలాంటి కార్యక్రమాలు పెంపొందిస్తాయని తెలిపారు. అన్ని పాఠశాలలోని 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు నవంబర్ 7, 21, 28వ తేదీల్లో జిల్లాస్థాయి చెకుముకి పోటీలు ఉంటాయని, డిసెంబరు 14, 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రతిభా పరీక్షల్లో విద్యార్థులను పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు


మర్కుక్: అవార్డు అందుకుంటున్న చిన్నబ్రహ్మయ్య

కొండపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత తెలుగు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి రాష్ట్రస్థాయి పురస్కారాలు అందజేస్తారు. విద్యారంగంలో సేవలు అందించిన సిద్దిపేట జిల్లాకు చెందిన పీవీ సత్యకుమార్ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యాడు. విజయవాడలో వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆ సంస్థ నిర్వహించిన 24వ ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన సత్యకుమార్ అన్నమయ్య జిల్లా మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, కన్నడ నటి పంకజ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నాడు. సత్యకుమార్ ఇప్పటికే పలు మండల స్థాయి, జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర స్థాయి పురస్కారం రావడంతో విద్యాశాఖ అధికారులు ఆయన్ను అభినందించారు.

- మర్కుక్: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి, సమాజ శ్రేయస్సు కోసం పాటు పడుతున్న ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి (టీఈఏ-2024) టీచర్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డుకు వై.సి. బ్రహ్మయ్య(భౌతికశాస్త్ర) జడ్పీహెచ్ఎస్ దామరకుంట ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, స్కైలైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డును ప్రదానం చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమయ్య, డా. షైనష్ జిందాల్, డా. జ్యోత్స్నరావు, డీఎంఆర్ఎల్ శాస్త్రవేత్త తస్నీరు నిరంజన్‌సోమ్యనాయక్, సొసైటీ వ్యవస్థాపకుడు పట్నం కమల మనోహర్, నరేంద్రస్వామిల చేతుల మీదుగా హైదరాబాద్‌లోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో జ్ఞాపికను అందజేశారు.

ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలి

బెజ్జంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరూ ఓటరు ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు ఎడబోయిన మల్లారెడ్డి కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సోమవారం ఓటరు ఎన్‌రోల్‌మెంట్ ఫామ్స్‌ను పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో అందజేశారు.

కేసీఆర్ తరహాలోనే రేవంత్‌రెడ్డి పాలన

- గజ్వేల్ బీజేపీ నాయకుల ఆరోపణ
- అంబేడ్కర్ సర్కిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

గజ్వేల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ తరహాలోనే రేవంత్‌రెడ్డి పాలన సాగుతున్నదని గజ్వేల్ బీజేపీ నాయకుల ఆరోపించారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయం వద్ద హిందువులపై జరిపిన లాఠీచార్జిని నిరసిస్తూ గజ్వేల్‌లో బీజేపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేయకుండా పోలీసులు అడ్డుపడినా వారు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు జశ్వంత్‌రెడ్డి, గజ్వేల్ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ మాట్లాడుతూ.. ముత్యాలమ్మ ఆలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేయడానికి వచ్చిన హిందువులపై లాఠీచార్జి చేసిన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హిందువులపై దాడులు ప్రారంభమయ్యాయని ఆరోపించారు. గత సీఎం కేసీఆర్ నిజాం తరహాలో పాలన చేస్తే అదే దారిలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఐల మహేందర్, నాయిని సందీప్, రాజశేఖర్‌రెడ్డి, కుడిక్యాల రాములు, సురేష్, వెంకటరెడ్డి ఉన్నారు.


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

చేపపిల్లల పంపిణీలో మత్స్యకారులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

- బీఆర్ఎస్ నాయకులు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): చేపపిల్లల పంపిణీలో మత్స్యకారులకు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ మత్స్యకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షుడు పడిగె ప్రశాంత్ ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది చెరువులు, కుంటల్లో వేయడానికి గతేడాదిచ్చిన చేప పిల్లల సంఖ్యలో సగం మాత్రమే ఇస్తామని ప్రభుత్వం నిబంధన విధించి, ఆ ప్రకారంగానే చేప పిల్లలను సరఫరా చేయడం సమంజసం కాదన్నారు. ఇలా చేయడం వల్ల చేపల ద్వారా ఉపాధి పొందే ముదిరాజ్ సామాజికవర్గానికి నష్టం కలుగుతుందని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచన చేయాలని కోరారు.

ఆగమాగం

5వ పేజీ తరువాయి

ఉండడంతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. అకాల వర్షం కారణంగా కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవుల మృతి


చిన్నకోడూరు: చెల్కలపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు

చిన్నకోడూరు/హుస్నాబాద్ రూరల్ : ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియగా పలుచోట్ల పిడుగులు పడ్డాయి. రెండు చోట్ల పిడుగుపాటుతో ఆవులు మృతిచెందాయి. చిన్నకోడూరు మండలంలోని చెల్కలపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రైతు కొలనుపాక కనకరెడ్డికి చెందిన ఆవు మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుంది. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బైరి లక్ష్మికి చెందిన పాడి ఆవు సోమవారం సాయంత్రం పడిన పిడుగుపాటుకు మృతి చెందింది. దాదాపు రూ.85 వేల విలువ ఉంటుంది. ఇదే గ్రామ పరిధిలోని సబ్‌స్టేషన్ పక్కన ఉన్న తాటిచెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి.

ధాన్యం దళారుల పాలు


ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో దళారులకు ధాన్యం అమ్ముకుంటున్న రైతు

నంగునూరు: ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా వరి కోతలు ప్రారంభమైనప్పటికీ నంగునూరు మండలంలోని ఒక పాలమాకుల కేంద్రం తప్ప ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీంతో రైతులు మార్కెట్లోకి తెచ్చిన ధాన్యం ఏం చేయాలో అర్థం కాక తక్కువ ధరకే దళారులకు అమ్ముతున్నారు. ఇదే అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది రైస్‌మిల్లర్లు తమ ఏజెంట్లు ద్వారా దళారులను ఏర్పాటు చేసుకుని దండుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతి రోజు ఆకాశంపై వస్తున్న మబ్బులతో గుబులు చెందుతున్న రైతులు ఎంతో కొంత నష్టం అనుకుని తప్పని పరిస్థితుల్లో దళారులకు అమ్ముకుంటున్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేం

5వ పేజీ తరువాయి

చేర్యాల సీఐ శ్రీను గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు, రమేష్, జానకిరామ్‌రెడ్డి, కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ మల్లేశం గౌడ్, ఏవో యాదమ్మ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, పూర్ణచందర్, విష్ణు ప్రసాద్, ధరణి కుమార్, రాజేష్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

పోలీస్ కమిషనరేట్‌ను సందర్శించిన కలెక్టర్

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌ను సోమవారం కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ నురాధ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఇరువురు అధికారులు జిల్లా భౌగోళిక పరిస్థితుల గురించి బార్డర్ పోలీస్ స్టేషన్ల గురించి జిల్లాలో ఎన్ని పోలీస్ స్టేషన్లు ఉన్నాయి, శాంతి భద్రతలు, జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి, తదితర అంశాలపై చర్చించారు.

'పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి'


చేర్యాలలో పోలీసు అమరవీరుల స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ ఎల్. శ్రీను, సిబ్బంది

హుస్నాబాద్ టౌన్/చేర్యాల/మద్దూరు/రాయపోల్/గజ్వేల్ రూరల్: విధి నిర్వాహణలో అమరులైన పోలీసులకు ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలరు పెరుక భాగ్యరెడ్డి, ఎండీ. హసన్ నివాళులర్పించారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం చేర్యాలలో సీఐ ఎల్ శ్రీను, ఎస్ఐ నీరేశ్, ఏఎస్ఐ నవీన్ తదితరులు పట్టణంలోని అమరవీరుల స్మారకస్థూపం వద్ద నివాళులర్పించారు.

మద్దూరు మండల కేంద్రంలో అమరవీరుల స్థూపానికి ఏఎస్ఐ విజయ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాయపోల్ పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సిద్దిపేట జిల్లా బీజేపీ ఆర్మీసెల్ మాజీ కన్వీనర్ నీల చంద్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దేవయ్య, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుల్ స్వామి, మండల బీజేపీ అధ్యక్షుడు రాజాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజు నువ్వులను ఉపయోగించి ఆరు అడుగుల స్థూపాన్ని చిత్రించి, వారి త్యాగాలను కొనియాడారు.

'ఆలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

గజ్వేల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ పట్టణంలో హైందవ సంఘాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగగా, పట్టణానికి చెందిన హైందవ సంఘాల నాయకులు పార్టీలకు అతీతంగా భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసిన నిందితులను, వారికి మద్దతు పలికిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో గజ్వేల్ పట్టణానికి చెందిన చాడ నందబాలశర్మ, శేషం శ్రీనివాసాచార్యులు, బుక్క రమేశ్‌గుప్తా, రాజశేఖరశర్మ, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి క్రాసింగ్ గ్రామానికి చెందిన బింగి స్వామిరోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మృతుడు కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

- కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజను తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, నారాయణరావుపేట మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎంపీడీవో శ్రీరాములుతో కలిసి ప్రారంభించారు.

- తొగుట: తొగుట మండల కేంద్రంతో పాటు, రాంపూర్, లింగంపేట, గుడికందుల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వైస్‌చైర్మన్ కుర్మ యాదగిరితో కలిసి కాన్గల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి ధాన్యం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్‌లు జయమ్మ, నాయకులు మాజీ సర్పంచ్ రమేష్‌గౌడ్, పులి యాదయ్య, చింత బైరారెడ్డి, ఏఈవో రాజేష్, పంచాయతీ కార్యదర్శి శ్యామల, కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.
- మద్దూరు: మండలంలోని లద్నూరు, ధర్మారం, మర్మాముల, సలాఖ్‌పూర్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఏవో రామకృష్ణ, బుచ్చిరెడ్డి, కామిడి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, ఏఈవో అఖిల్, రామడుగు బాల్‌రాజ్, సీఈవో బోయిని శ్రీధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.
- అక్కన్నపేట: మండలంలోని జనగామ, గొల్లకుంట, కేశనాయక్‌తండా, రామవరం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ప్రారంభించారు. ఆయనవెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, ఏపీఎం శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ బుర్ర ప్రభాకర్, సీసీలు గొర్ల తిరుపతి, శివచరణ్‌సింగ్, రాజు, ఉన్నారు.


నారాయణరావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీరాములు, పూజల హరికృష్ణ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాఘవాపూర్ విద్యార్థులు


రాష్ట్రస్థాయి ఖోఖోకు ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలకు సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజు భార్గవి, వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్ తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల్లో వారు సిద్దిపేట జిల్లాలో రెండో స్థానంలో నిలిచారని చెప్పారు. ఖోఖోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి తమ పాఠశాల ఎనిమిదోవ తరగతి విద్యార్థులు హరీశ్, శివప్రసాద్, రంజీత్‌లు ఎంపికయ్యారని వెల్లడించారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో బందారం విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక, అక్టోబరు 21: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కొండపాక మండలం బందారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 17 వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో ద్వితీయ బహుమతి, అండర్ 14 బాలికల విభాగంలో మూడో బహుమతి గెలుచుకున్నారు. వీరు జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

శరణు ఘోషతో మార్మోగిన రాజీవ్ రహదారి


మహాపాదయాత్రలో నృత్యాలు చేస్తున్న అయ్యప్ప స్వాముల

కొండపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాలధారుల శరణు ఘోషతో రాజీవ్ రహదారి మార్మోగింది. సిద్దిపేట నుంచి శబరిమలకు ప్రారంభించిన మహాపాదయాత్ర సోమవారం రెండో రోజు కొండపాక మండలం రాజీవ్ రహదారిపైన ఉన్న హనుమాన్ ఆలయం మీదుగా సాగింది. మెదక్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట భక్తులు డప్పు చప్పుల్లతో అయ్యప్పస్వాములకు స్వాగతం పలికారు. పాదయాత్రలో గురుస్వాములు నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, దుర్గారెడ్డి, కన్నెస్వామి ఆరుట్ల యాదవరెడ్డి, సిద్దిపేట వ్యాపారి ఇల్లందుల చందుస్వామి తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నంగునూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నంగునూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయినా పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తదితరులున్నారు.